# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళా రిజర్వేషన్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

2. **విద్యతోనే అభివృద్ధి సాధ్యం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో సినీ పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వాహకులు తగిన కార్యాచరణతో ముందుకు వస్తే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సినీమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

4. **కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం-రాహత్ పథకాన్ని రాష్ట్రంలో త్వరలో ప్రారంభిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.**

=============================

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. 2029 లోక్‌సభతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహించాలని ఆయన చెప్పారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందు లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు రాసిన లేఖలో ప్రధానమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. "నారీ శక్తి వందన్ అధినియం"గా పిలవబడే ఈ చట్టానికి అవసరమైన సవరణలను అన్ని పార్టీలు కలిసి ఆమోదించాలని కోరారు. దేశవ్యాప్తంగా మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

--------------------------

పరిపాలనలో మహిళలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో తీసుకొస్తున్న "నారీ శక్తి వందన్ అధినియం" ఒక కొత్త అధ్యయనానికి నాంది పలుకుతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... మహిళలకు గౌరవం, చట్ట సభల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ఈ బిల్లు ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

విద్యతోనే అభివృద్ధి సాధ్యం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కొండుమూరులో ఆయన నిన్న పర్యటించారు. ముప్పవరం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొండమూరు వరకు 45 లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డును, 30 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడు కాలువలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రయాణ భారంతో విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

-------------------------

దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పఖ్వాడా--2026 కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం పోషణ్ పఖ్వాడా 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్ఠంగా పెంపొందించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, పోషణ పంచాయతీలు, ఆటల ఆధారిత అభ్యాస కార్యక్రమాలు చేస్తున్నారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీన్ టైమ్ తగ్గింపు వంటి అంశాలపై ప్రచారం చేపట్టారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వాహకులు తగిన కార్యాచరణతో ముందుకు వస్తే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సినీమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగా కల్పించుకోవాని సూచించారు. అందుకు అవసరమైన సబ్సిడీలు రాయితీలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. పాలకొల్లు కళలకు, కళాకారులకు నిలయమని పేర్కొన్నారు.

-------------------------

ప్రజలకు ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతిని అందించటం కోసం భారత్ గౌరవ్ పేరుతో రైల్వే శాఖ ప్రత్యేక టూరిస్టు రైళ్లను నడుపుతోందని IRCTC జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ తెలిపారు. గుంటూరులో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన విశాఖపట్నం నుంచి ప్రత్యేక టూర్ ప్యాకేజిని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్యాకేజీలలో రైల్ టికెట్లు, ఆహారం, బస, స్థానిక రవాణా వంటి అన్ని సౌకర్యాలు ఉంటాయని IRCTC జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ వివరిస్తూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం-రాహత్ పథకాన్ని రాష్ట్రంలో త్వరలో ప్రారంభిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ పథకంలో రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ చికిత్సలో భాగంగా లక్షా 50 వేల రూపాయల వరకూ వైద్యసేవలు లేక 7 రోజులపాటు ఉచిత వైద్యం అందించాల్సి ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు 6 వందల 87 ప్రైవేట్, 17 ప్రభుత్వ ఆసుపత్రులను గుర్తించామన్నారు. బాధితుల ఆర్థిక

స్థితి, స్థానికతతో నిమిత్తం లేకుండా ఈ పథకంలో తక్షణ చికిత్స అందించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ – (జేఈఈ) మెయిన్ తుది విడత పేపర్–1 ప్రాథమిక కీని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) గత రాత్రి విడుదల చేసింది. కీ పై అభ్యంతరాలుంటే ఈనెల 13వ తేదీ రాత్రి 11 గంటల 50 నిమిషాల వరకు ఆన్‌లైన్‌లో పంపవచ్చని ఎన్‌టీఏ తెలిపింది.

---------------------------

ప్రపంచవ్యాప్తంగా 'గుడ్ డీడ్స్ డే'ను ఈరోజు నిర్వహిస్తున్నారు. 100కి పైగా దేశాలకు చెందిన లక్షలాది మంది స్వచ్ఛంద సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవా భావాన్ని చాటుకుంటున్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక దినాన్ని జరుపుకుంటున్నారు. 2007లో దాతృత్వవేత్త షారి అరిసన్ ప్రారంభించిన ఈ ఉద్యమం, మంచి ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని ప్రజలను ప్రేరేపిస్తోంది. పేదలకు ఆహారం, దుస్తులు అందించడం, వృద్ధులకు సహాయం చేయడం, అనాధాశ్రమాల్లో సేవలు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా పార్కులు, వీధులు శుభ్రపరచడం, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాలు చేస్తున్నారు. ఒకే రోజు ప్రపంచవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం, సేవా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజంలో ఐక్యతను బలపరుస్తోంది. మంచి పనులు చిన్నవైనా వాటి ప్రభావం పెద్దదేనని ఈ దినం సందేశమిస్తోంది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకనా క్రికెట్ స్టేడియంలో ఈ మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖేడే స్టేడియంలో ఈ రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై పంజాబ్ కింగ్స్ విజయం సాధించగా, మరో మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గెలుపొందింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయని అమరవతిలో భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు పొడి వాతావరణం కొనసాగుతోందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ..

వాయిస్... 20 సెకన్లు

---------------------------

బధిరులతో మాట్లాడేందుకు ప్రత్యేకంగా రూపొంచిందిన సంజ్ఞల భాషను అందరూ నేర్చుకుని.. వారికి భరోసాను కల్పించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ సందర్భంగా చెవిటి, మూగ వారితో సంభాషణకు వీలుగా ఉండే సంజ్ఞల భాష గోడ పత్రికను ఆయన నిన్న ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రిని జిల్లాలోని బదిరుల అసోసియేషన్ ప్రతినిధులు నిన్న కలిశారు. బదిరులకు ఉపాధి, ఇళ్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

====================